
# ఆపద్ధర్మం



అవి నేను, నా మిత్రుడు మూర్తీ విజయవాడలో పనిచేస్తున్న రోజులు.

ఒకసారి నాగార్జున సాగర్‌కి వెళ్లి రావాలనుకున్నాం. అయితే... విజయవాడ నుంచి డైరెక్టు బస్ బయలుదేరే సమయాలు మాకంత కన్వీనియంట్‌గా లేవు. అందువల్ల ప్రొద్దుటే గుంటూరు వెళ్లి అక్కడ నుంచి 8:30 బస్‌లో వెళ్లాలనుకున్నాం.

ఉదయం 7:15కి గుంటూరులో బస్ దిగాం. ఇంకా గంటపైగా టైముంది కాబట్టి కొంచెందూరంలో ఉన్న మంచి హోటల్‌కి వెళ్లి కాఫ్యాదులు కానిచ్చాం.

తిరిగి బస్‌స్టాండ్ వైపు బయలుదేరాం.

ఉన్నట్లుండి మూర్తి నానా ఆయాసపడడం మొదలుపెట్టాడు.

"ఏమిటి సంగతి?" అంటే-

"హోటల్లో తిన్న టిఫిన్ ఒత్తిడి ఎక్కువైయిందో, ఏమో... అర్జంటుగా కడుపు ఖాళీ చేసుకోవాలి" అంటూ హడావుడి పడటం మొదలుపెట్టాడు.

ఏమిచేయాలో తోచలేదు. కొత్త ఊరు. ఎక్కడికిపోతాం?

వాచీ చూస్తే 7:50 అయింది. ఇంక నలభై నిమిషాలే టైముంది. ఏమి చెయ్యడం?

మూర్తి ముఖం చూస్తుంటే... ప్రసవం రాక పురిటినొప్పులు పడ్తున్న నిండుచూలాలు గుర్తుకువచ్చింది.

ఒక్కసారి నాలుగువైపులా చూశాను.

ఎదురుగుండా మునిసిపల్ ఆఫీసు కనిపించింది. ఇంక పర్వాలేదనుకొని మూర్తిని అటు తీసుకుపోయాను.

తీరా అక్కడ లావెట్రీలు ముచ్చటగా మూడున్నాయికాని, వాటి తలుపులు తాళాలు వేసి ఉన్నాయి. వాటిని చూడగానే నా గుండెలో రాయి పడింది.

మూర్తికి హడావిడి, గాబరా ఎక్కువయ్యాయి.

అక్కడ ఏం ప్రమాదం తెచ్చిపెట్తాడోనని భయంవేసింది.

ఆ విన్యాసాలు చూసేసరికి నాకు కూడా కడుపులో గందరగోళం, అల్లకల్లోలం ప్రారంభమయ్యాయి. గుడ్లు తేలవేసి... 'నీవేతప్ప నిహ పరంబెరగ...' అన్న రీతిలో కొంచెంసేపు వాటివంక చూస్తుండిపోయాం. ఆ దగ్గర్లో వేరే ఏవైనా ఉన్నాయేమోనని చిన్న రౌండ్ కొట్టి వచ్చాను.

ఇంతలో... మా పాలిట ఆపద్బాంధవుడిలా ఒక వ్యక్తి అక్కడకి వచ్చి మధ్యనున్న లావెటరి దగ్గరకువెళ్లి తాళం తీయబోయాడు. వెంటనే మెరుపులా నాకు ఆలోచన వచ్చింది.

"ఏమండీ... మీరిక్కడ పనిచేస్తున్నారా?" అని అడిగాను.

"అవును. నేనిక్కడ వాచ్‌మన్‌ని!" అన్నాడు.

"కమీషనర్‌గారు ఎప్పుడు వస్తారు?" అని మళ్లీ అడిగాను.

"ఆయన పదిగంటలకు వస్తారండీ. మీరు ఆయనకోసం వచ్చారా?" అన్నాడు.

"అవునండీ... ఆయన మాకు దగ్గర బంధువు. ఇల్లు తెలీక, ఇక్కడడిగితే తెలుస్తుంది కదాని వచ్చాం. మాది బందరు లెండి. ఇప్పుడే బస్ దిగాం" అన్నాను.

"అలాగా... ఆయనదీ బందరే!" అంటూ ఆయన అడ్రసు చెప్పబోయాడు.

నేను- "ఎలాగూ ఆయన మరో గంటా, గంటన్నరకు వస్తారుకదా... ఇక్కడే కలుసుకుంటాం లెండి. ఈలోపల కాస్త ముఖం కడుక్కొని తయారవుతాం. బాత్‌రూం ఎక్కడుందో చూపిస్తారా!" అన్నాను.

అతను వెంటనే ఆ మధ్య లావెటరీ తాళంచెవి మాకిచ్చి- "ఇది కమీషనర్‌గారు ఉపయోగించేది. మీ పని అయ్యాక- అదిగో... ఆ ఎంట్రెన్స్‌కి దగ్గర హోటల్లో ఉంటాను. తాళంచెవి ఇచ్చేయండి..." అంటూ అటు చూపించాడు.

"కాని, మీరు వెళ్లబోతున్నట్లున్నారు..." అని నసిగాను.

"పర్వాలేదు- నాకంత అర్జన్సీ లేదు" అంటూ హోటలు వైపు వెళ్లాడు.

మేము 'బ్రతుకుజీవుడా...' అనుకుంటూ పరమానందంతో ఒకరి తర్వాత ఒకరం లావెటరి ప్రవేశం చేశాం.

లోపల చలువరాతి గోడలున్న బాత్‌రూం. వాష్ బేసిన్, వెస్టర్న్ కమ్మోడ్. అన్నీ శుభ్రంగా ఉన్నాయి. మేము ఇద్దరం ఆఫీసర్లలాగా ఆ బాత్-కం-లేట్రిన్‌ని ఉపయోగించుకుని కొత్తపెళ్ళికొడుకుల్లాగా రిఫ్రెష్ అయి బయటకు వచ్చాం.

తాళంచెవి అతనికిస్తూ- "చాలా థాంక్స్! ఇంకా టైముంది. ఈలోగా హోటల్‌కి వెళ్లి టిఫిన్ చేసి వస్తాం" అన్నాను.

పాపం... ఆ వ్యక్తి మాకు అంతటి గౌరవం ఇవ్వడానికి కారణం- మేము కమీషనర్‌గారి బంధువులమని చెప్పడమే!

మేము ఆడింది అబద్ధమే కాని, ఆపద్ధర్మంగా ఆడాం. 'ప్రాణ, విత్త, మాన భంగమందు బొంకవచ్చు...' అన్న శుక్రనీతిని గుర్తుచేసుకుంటూ బస్‌స్టాండ్‌కి బయలుదేరాం.

గుంటూరు వెళ్లినపుడల్లా నాకీ సంఘటన గుర్తుకి వస్తూనే ఉంటుంది.

- ఆకాశిక్... నవంబర్ '2001



**ఇప్పటికి పదిహేడు**

సీనియర్ డాక్టర్ : మీరు మరీ అంత లోతుగా కట్ చేయకండి డాక్టర్.
ఈ నెలలో ఇప్పటికే మీరు పదిహేడు ఆపరేషన్ టేబుళ్లని నాశనం చేశారు.